## చిన్నకథ



'వెలుగు' దినపత్రిక ఆఫీసు.
'విచిత్రవార్త' బ్యూరో స్టాఫ్ అంతా టెన్షన్‌గా ఫీలవుతున్నారు. బ్యూరో చీఫ్ అయితే సరేసరి. కారణం మర్నాడు పేపర్లో కనబడాల్సిన 'విచిత్రవార్త'కు సంబంధించిన ముడిసరుకు ఇంకా అందలేదు. జిల్లాలోని విలేఖరులందరికీ చీఫ్ సెల్‌ఫోన్ చేసి మాట్లాడుతున్నారు. ఒక్కో నెంబర్‌తో మాట్లాడడం అయిపోతూనే చీఫ్ మొహంలో అసంతృప్తి పెరుగుతూ ఉంది.

# కర'వాలం'

**శ్రీధర రామకృష్ణ**

'విచిత్రవార్త' వెలుగు పత్రికకు గుండెకాయ లాంటిది. దినపత్రిక విడుదలైన మొదటిరోజు నుంచీ ఏదో ఒక విచిత్రవార్త 'వెలుగు'లో దర్శన మిస్తూనే ఉంది. 'వినాయకుని రూపంలో బొప్పాయి పండు' అనో, 'మూడు కాళ్ళున్న కోడి' అనో, 'ఆరుకాళ్ళున్న ఆవుదూడ' అనో, 'కృష్ణపాదం లేని కృష్ణసర్పం' అనో, 'అమ్మాయిలా మారిన అబ్బాయి' అనో ఇలా ఏదో ఒక రకమైన 'విచిత్రవార్త' పత్రికలో ప్రతిరోజూ ప్రచురింప బడడంతో 'విచిత్రవార్త' 'వెలుగు దినపత్రికకు ప్రత్యేకమైన ఆకర్షణగా మారిపోయింది. నిజం చెప్పాలంటే 'వెలుగు'ను కొనగానే పాఠకుడు మొదటగా చూసేది, చూడాలనుకునేదీ ఆ 'విచిత్రవార్తే'. 'విచిత్రవార్త'ల్ని క్రమం తప్పకుండా ప్రచురిస్తున్నందుకు 'వెలుగు' గిన్నిస్‌బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో కూడా స్థానం సంపాదించుకుంది.

''విచిత్రవార్తకి సంబంధించిన ఫ్యాక్స్‌లు ఏమైనా వచ్చాయేమో చూడు'' అసిస్టెంట్‌తో అన్నాడు చీఫ్.

''ఇందాకట్నుంచి వాటి గురించే ఎదురు చూస్తున్నాం సార్! ఇంతవరకూ ఒక్కటీ రాలేదు'' బదులిచ్చాడు అసిస్టెంట్.

'లాభం లేదు. ఇంకో అరగంటలో ఎలాగైనా 'విచిత్రవార్త' కావాలి. లేకపోతే విచిత్రవార్త లేకుండా పేపర్ ప్రింటైపోతుంది' మనసులో ఈ విషయం మెదలవగానే చీఫ్‌లో అసహనం మరింత పెరిగింది.

ఈ విషయం ఎడిటర్‌కి తెలిస్తే కొంప మునిగిపోతుంది. అసలు 'విచిత్రవార్త' లేని 'వెలుగు'ను ఊహించడానికే భయంగా ఉంది. ఎండీ నుండి ఎడిటర్ దాకా దాని పట్ల ప్రత్యేకమైన ఆసక్తి కనబరుస్తారు.

చీఫ్ తన ఆంతరంగిక అసిస్టెంట్‌ను పిలిపించాడు.

''చెప్పండి సార్!'' చేతులు కట్టుకుని ఎదురుగా నిలబడి ఉన్నాడా అసిస్టెంట్.

''ఈరోజు 'విచిత్రవార్త'కు మేటరేం రాలేదు. ఒక్కోసారి రెండు మూడు 'విచిత్రవార్త'లు వచ్చినప్పుడు వాటిని ప్రిజర్వ్ చేసుకుని కన్వీనియెంట్‌గా ఫీలయిన సందర్భాలు ఎన్నో ఉన్నాయి. ఆ విషయం నీకు కూడా తెలుసు. పత్రిక పెట్టిన ఇన్నాళ్ళకి ఈ గడ్డు పరిస్థితి వచ్చింది''

అసిస్టెంట్ చీఫ్ చెప్పేదంతా శ్రద్ధగా వింటు న్నాడు. అతని దృష్టిలో చీఫ్ దేవుడు. కాదు దేవుడి కంటే ఎక్కువ. డిగ్రీ చదివి బలాదూర్‌గా తిరుగుతున్న తనకు ఆ పత్రికలో ఉద్యోగం ఇప్పించి తను బ్యూరోలో ఒక ముఖ్యుడిగా ఎదగడానికి ఆయన ఎంతగానో సాయ పడ్డాడు.

తళుక్కున అతని బుర్రలో ఒక ఆలోచన మెరిసింది. తను ఇంటికి దగ్గర్లో ఉన్న గొర్రెల కాపరి ఇంట్లో కొత్తగా ఆరోజే కనబడిన గొర్రెపిల్ల కళ్ళముందు కదలాడింది.

''నాతో బాటు ఫోటో గ్రాఫర్‌ని పంపండి సార్!'' చీఫ్ టెన్షన్‌ని తగ్గించే ప్రయత్నం చేస్తూ అన్నాడు అసిస్టెంట్.

చీఫ్ అతని వేపు ప్రశ్నార్థకంగా చూస్తూ అన్నాడు ''టైం అరగంటకంటే ఎక్కువ లేదు''

''పర్వాలేదు సార్. ఇరవై అయిదు నిముషాల్లో వార్తతో, సంబంధిత ఫోటోలతో మీ ముందుంటాను'' అభయమిచ్చాడు అసిస్టెంట్.

సంతృప్తికరంగా ఫీలవుతూ, అసిస్టెంట్ భుజం తట్టాడు చీఫ్.

మర్నాడు 'వెలుగు'లో ప్రచురితమైన 'విచిత్రవార్త' చూసి పాఠకులు యథాప్రకారం విస్మయం చెందారు.

వార్త ఇలా ఉంది.

తోకలేని గొర్రెపిల్ల.

వెలుగు: విచిత్రవార్త బ్యూరో: కడప జిల్లా కొడమలూరు మండలం కురబలవారి పల్లె గ్రామంలో తోకలేని గొర్రెపిల్ల జన్మించింది. తోకలేకుండా ముద్దుగా ఉన్న ఈ గొర్రెపిల్లను చూడడానికి చుట్టుప్రక్కల గ్రామాల నుంచి జనం తండోపతండాలుగా వస్తున్నారు. గుజ్జుల వెంకట సాయిరెడ్డి ఈ గొర్రెపిల్ల యజమాని.

పత్రికలో వార్తను మరోసారి చూసుకున్న చీఫ్ మొహం సంతృప్తితో వెలిగిపోయింది. మనసులో తన అసిస్టెంట్ పట్ల కృతజ్ఞతాభావం కదలాడింది.

కానీ ఆ పత్రిక మార్కెట్లోకి విడుదలైన అరగంటకు ఆ గొర్రెపిల్ల చనిపోయింది. క్రూడ్ పద్ధతుల ద్వారా దాని తోకను తొలగించడంతో సెప్టిక్ అయి గొర్రెపిల్ల చనిపోయిందని పశువుల డాక్టర్ ధృవీకరించాడు. డబ్బుకి కక్కుర్తి పడినందుకు తనకు తగిన శాస్తి జరిగిందని ఆ గొర్రెపిల్ల యజమాని భోరున విలపించాడు.

★